కథానిక:

'తమ్ముడు'

శ్రీ ఆనందమూర్తి

మనుకి సర్వప్రపంచం వాళ్ల అక్కయ్యే! అక్కయ్య లేకపోతే తాను ఒక్క క్షణం ఉండలేడు. తన బ్రతుకుకంతా ఆధారం అక్కయ్యే. తాను జీవిస్తున్నది అక్కయ్య మూలాన్నే—తాను జీవిస్తున్నది అక్కయ్య కోసమే—అనుకుంటాడు మను. అక్కయ్యే గనక లేకపోతే తానూ లేననుకుంటాడు. వాళ్ల అక్కయ్యని చూస్తూ ఉంటే ఏదో అన్నం తింటున్నట్టుగానూ, అక్కయ్యతో మాట్లాడుతూంటే అమృతం త్రాగుతున్నట్టుగానూ భావిస్తాడు మను.

అమ్మకన్నా అక్కయ్యంటేనే ఎక్కువ చనువు మనుకి. అక్కయ్యంటే ఎంతో ప్రేమ—ఎంతో భక్తి. దీనికి కారణం మనుమీద వాళ్ల అక్కయ్యకు గల వాత్సల్యం. తమ్ముడంటే అక్కయ్యకు వాత్సల్యం. అక్కయ్యంటే తమ్ముడికి ప్రేమ—చిన్ననాటినుంచీ మనని చేతుల్లో పెంచింది అక్కయ్య. అక్కయ్య చేత్తో పోస్తేనేగాని తమ్ముడు తలంటుకూడా పోసుకోడు. అక్కయ్య ప్రక్కన ఉంటేనే గాని అన్నం తినడు. అక్కయ్యతో మాట్లాడకపోతే అన్నం జీర్ణంకాదు. తన సర్వకార్యక్రమాలలోనూ అక్కయ్య వెంట ఉండాలిసిందే!

చిన్ననాడు అక్కయ్యే అన్నం కలిపి పెట్టేది తమ్ముడికి. మను రాత్రిళ్లు వాళ్ల అక్కయ్య పక్కనే పడుకునేవాడు. అక్కయ్య కథలు చెబుతోంటే జోలపాటల్లాగా అనిపించేది మనుకి. ఊఁ కొడుతూ నిద్దరోయేవాడు. తెల్లవారి లేచి పక్కమీద అక్కయ్య లేకపోతే "అక్కయ్యా!" అంటూ పరుగెత్తుకెళ్లేవాడు. మనుకి బడియీడు వచ్చేదాకా అక్కయ్యను విడిచి ఒక్కక్షణం వుండి ఎరుగడు.

మను చిన్నతనంలో—ఒక రోజు రాత్రి ఏడుస్తూ పడుకున్నాడు. అక్కయ్య వచ్చి చూచి బుజ్జగించి బుజ్జగించి అడిగింది. కారణం ఎంతకీ చెప్పలేదు మను. చెప్పమని బతిమాలింది—చివరకి చెప్పేడు దుఃఖపడుతూ "అక్కయ్యా! పుట్టిన వాళ్లంతా చచ్చిపోతారా?" అక్కయ్య ఒళ్లు జల్లుమన్నది. "వెర్రివాడా! అప్పుడే నీ కెందుకూ?..." అన్నది అక్కయ్య. మను పెద్ద పెట్టున ఏడవటం మొదలెట్టేడు. "అయితే, నువ్వుకూడా చచ్చిపోతావా అక్కయ్యా?"—అక్కయ్య గ్రహించింది మనువిచారం. మనుమీద జాలేసింది ఆ అమాయకత్వానికి—తనమీద వున్న అప్రేమకి, అప్రయత్నంగా అక్కయ్య నోట్లోంచి యీ మాటలు వచ్చినాయి: "పోను—బాబూ...పోను..." తమ్ముణ్ణి దగ్గఱ తీసుకుని హృదయానికి హత్తుకుంది.

క్రమంగా మనుని బళ్లో వేసేరు. అతికష్టంతో బడిగంటలు లెక్కబెట్టుకునేవాడు మను. బడికి పోబోయే ముందు క్షణందాకా అక్కయ్య వెంటనే వుండేవాడు. ఇంటి గేటుదాకా వచ్చి తమ్ముణ్ణి, అక్కయ్యే సాగనంపాలి బడికి. మధ్యాహ్నానికి అన్నం కలిపి టిఫిను కేరీరులో పెట్టి యిచ్చేది తమ్ముడికి. ఎంతో ఆనందంతో అది తీసుకుని బడి కెళ్లేవాడు మను. సాయంత్రం బడిగంట కొట్టంగానే పరుగెత్తుకొచ్చేవాడు. రాంగానే అక్కయ్య తమ్ముణ్ణి దగ్గఱచేర్చి "ఏమిటి ఈ పూట బళ్లో...మధ్యాహ్నం అన్నం బావుందా?" అని పరామర్శించాలి. 'ఇవాళ అలవల నేర్చుకున్నా నక్కయ్యా!' అని ఎంతో సంతోషంతో చెప్పకొచ్చేవాడు. "అక్కయ్యా! మరి నువ్వు మాకు మేష్టారుగా రాకూడదూ? ఎప్పుడూ నాతోనే వుండొచ్చు. ఇద్దరం కలిసి బడికిపోవచ్చు ఊఁ?" అనేవాడు అమాయకంగా. కొన్నేళ్ళు మేడమీద కబుర్లు చెప్పకుని చదువుకునేవారు. మేష్టారుని పెట్టినా వద్దని తీయించేసి అక్కయ్యదగ్గరే పాఠాలు నేర్చుకునేవాడు. "రేపటికి యీ పద్యాలు రావాలి తమ్ముడూ!" అనేది అక్కయ్య. మరునాడు ఒప్పచెప్పేశేవాడు మను.

మను సెకండుఫారానికి వచ్చేడు. బడి బాగా అలవాటయింది. చదువుకునేవాడు. కొంటె పనులు చేస్తూ గిల్లికజ్జాలు తీసుకొచ్చేవాడు. ఒకనాడు బడిలో ఒక పెన్సిలు కాజేసేడు దొంగతనంగా. పెన్సిలు దాచేసి ఏమీ ఎరుగనివాడిలా కూర్చున్నాడు. సాయంత్రం బడిగంట కొట్టంగానే 'అక్కయ్యా!' అంటూ పరుగెత్తుకొచ్చాడు. 'ఏమిటి విశేషాలు బడిలో?' అని అడిగింది అక్కయ్య మామూలుగా. "నే నో తమాషా చేసేను" అన్నాడు మను. 'ఏమిటది?' అంది అక్కయ్య. పెన్సిలు చూపుతూ 'నా ఫ్రెండుది...తీసుకువచ్చా తెలీకుండా...గమ్మత్తు!' అన్నాడు మను. అక్కయ్యకేసి చూశేడు అక్కయ్య మెచ్చుకుంటుందని. పెన్సిలు తెలీకుండా తీసుకువచ్చి గమ్మత్తు చేసేననేగానీ దొంగిలించి తప్పుచేసేనని, అప్పటికింకా తోచలేదు మనుకి. అక్కయ్యకేసి చూస్తున్నాడు. అక్కయ్య ఎందుకో విచారంగా కనబడ్డది. కళ్లవెంబడి నీళ్లు కారుతున్నయి. ఏమిటోగా చూస్తోంది తన చేతిలో వున్న పెన్సిలుని. మనుకి అర్థం కాలేదు. అక్కయ్య కన్నీళ్లతోబాటు మను చేతిలో పెన్సిలుకూడ నేలబడ్డది. అక్కయ్య దగ్గఱ కొచ్చి కూచున్నాడు మను. 'అక్కయ్యా! ఏడుస్తున్నావా?' అన్నాడు. 'తమ్ముడూ' అంది అక్కయ్య గుటక మ్రింగుతూ. 'ఏమిటక్కయ్యా!' అన్నాడు ఆదుర్దాతో అక్కయ్య ముఖంకేసి చూస్తూ. 'దొంగ.. తనం...చేశావా బాబూ?' అన్నది అక్కయ్య కొంగుతో కళ్లు తుడుచుకుంటూ. తాను చేసింది తప్పని అప్పటికి తెలిసి వచ్చింది మనుకి. అక్కయ్య ఏడిచింది. తాను చేసింది తప్పుకాదూ? పెద్దతప్పు. చెయ్యరాని పని చేశాడు కాబట్టే అక్కయ్య దుఃఖపడింది. తన మూలాన అక్కయ్యకి కష్టం కలిగిందని చాలా నొచ్చుకున్నాడు, 'అక్కయ్యా, ఏడవకు—తప్పు చేశాను. ఇకెప్పుడూ చెయ్యను' అని గబగబా చెంపలు వాయించుకున్నాడు. తాను చేసిన తప్పు, తప్పని తెలిసి ఒప్పుకున్నాడు. ఇంకెప్పుడూ చెయ్యనన్నాడు. అక్కయ్యకెంతో సంతోషమైంది. చెంపలు వాయించుకొంటున్న మను చేతులు పట్టుకుంది. 'తప్పమ్మా! వెళ్లి యిచ్చేసిరా' అని క్రింద పడివున్న పెన్సిలు తీసి మనుచేతి కిచ్చింది. 'రేపు బళ్లో యిచ్చేస్తానక్కయ్యా!' అన్నాడు. 'నువ్వు పెన్సిలు యిచ్చేవరకూ నే నన్నంతినను' అంది అక్కయ్య. ఈ మాటకి మను హృదయం దద్దరిల్లిపోయింది. పగలు సొమ్ము తనదగ్గఱ ఒక్కక్షణంకూడా ఉండకూడదని తెలుసుకున్నాడు. పాపం! తన మూలాన అక్కయ్య ఎంత కష్టపడిందో! మనుకి దుఃఖం వచ్చింది. కళ్లవెంబడి నీళ్లు కారినై. చేతిలో వున్న పెన్సిలు ఓపాములా కనిపించింది. ఒళ్లంతా తేళ్లూ, పాములూ కరిచినట్టనిపించింది మనుకి. 'అక్కయ్యా! ఇప్పుడే యిచ్చివస్తా. అన్నంతింటావా?' అన్నాడు మను. 'తింటాను. త్వరగా వెళ్లు' అన్నది అక్కయ్య. పరుగెత్తుకెళ్ళేడు. అక్కయ్య వాకిట్లో నుంచుంది మను రాకకోసరం. రాంగానే అంది—'చీకట్లో వెళ్లేవు. ఇచ్చేవా బాబూ? రా, భోజనంచేదాము!' చెయ్యి పట్టుకుని వెంట తీసికెళ్లింది. భోజనంఅయాక తమ్ముడి దగ్గర కొచ్చి 'తమ్ముడూ, దొంగతనం చెయ్యడం, అబద్ధాలాడడం తప్పు బాబూ' అన్నది నెమ్మదిగా. 'ఇకమీదట చెయ్య నక్కయ్యా. బుద్ధొచ్చింది' అన్నాడు మను అక్కయ్యఒడిలోకి జరుగుతూ. తమ్ముడి హృదయం వికసించినందుకు అక్కయ్య సంతోషించింది. ఒకసారిగా మను శిరస్సుని మూర్కొన్నది వాత్సల్యం ఉట్టిపడేట్లు. మను అక్కయ్యచేతుల్లో తన ఒళ్లు తాను మరిచిపోయినాడు.

రోజులు గడిచిపోయాయి. ఒకనాటిరాత్రి మను, యింటిప్రక్కన వున్న గుడి మంటపంలో పడుకుని దుఃఖిస్తున్నాడు. మను దుఃఖకారణం పాఠకులు యింతలో వూహించలేరు. మను హృదయం ఎందుకో తీవ్రమైన ఆవేదన పడుతోంది. ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఆనాడు వారి యింట్లో ఉత్సవవిశేషంగా సందడిగా వుంది మరునాడు మను అక్కయ్యకు పెళ్లి. బంధువులందరూ వచ్చేరు. అందరూ ఆ సంరంభంలో ఉన్నారు. మనుమాటే పరిచిపోయాడు. ఆనాడు అక్కయ్యకూడా పట్టించుకోలేదు మను విషయం. మను మంటపంలో నున్నట్టు ఎవరికీ తెలియదు. రాత్రి అయిపోయింది. పన్నెండయింది...ఒకటయింది...రెండయింది. మను ఆరాత్రి భోజనానికి రాలేదు. అది ఎవ్వరూ గురించలేదు. మనుకి రాత్రి నిద్రపట్టలేదు. ఏదో భారం అనుభవిస్తున్నాడు. రోజూ తానెక్కడ వున్నా వెతుక్కుంటూ వచ్చి 'తమ్ముడూ, రా, భోజనానికి' అని పిలుచుకెళ్లేది. ఆనాడు రాలేదు. మనుకి కష్టంగా వుంది. అక్కయ్య వివాహం అవడంతోటే మను హృదయంలో ఏదో దిగులుగా వుంది. వివాహం అయితే అక్కయ్య బావతో వెళ్లిపోతుంది. 'ఇక తన్ను 'తమ్ముడూ' అని పిలిచే దెవరూ? తానెలా జీవించటం అక్కయ్య లేకపోతే!' ఇదే అతని విచారం. తాను భోజనం చెయ్యటానికి యిష్టపడలేదు. కడుపులో ఏదో ఆరాటంగా వుంది. తన్ను పిలుచుకు పోడానికి అక్కయ్య వస్తుందనుకున్నాడు మను. కాని ఆనాడు అక్కయ్య మనుమాట మరిచిపోయింది. రాలేదు. మనుకి ఆవేదన ఎక్కువైంది. 'అక్కయ్య నన్ను మరిచిపోయిందా అప్పుడే! నే నెంత అభాగ్యుణ్ణి!' అని తన్ను తాను నిందించుకున్నాడు. నిద్ర పట్టలేదు. ఇదే దిగులు. తెల్లారింది. మను యింట్లోకి రాలేదు. పళ్లు తోముకోలేదు. ఇంటిలో అందరూ టిఫిన్లుచేస్తున్నారు. మనుమాట ఎవరూ చూడలేదు. ఉదయం ఏడుగంటలకు ముహూర్తం. లోపలి కెళ్లి అక్కయ్యని చూడాలని, అక్కయ్యతో మాట్లాడాలని వుంది మనుకి. కాని ఏమిటో దిగులుగా వుంది. నెమ్మదిగా వాకిటి కిటికీనుంచి చూశేడు. అలంకారాలతో తలవంచుకుని కూచునివుంది అక్కయ్య పీట మీద. తమ్ముడి గుండెల్లో భారంగా వుంది. అక్కయ్య ఇంక వెళ్లిపోతుంది! దుఃఖం వచ్చింది. చూడలేకపోయాడు. ఇల్లువదిలి బయటికి వచ్చేశేడు. పెద్దపెట్టున ఏడ్చాడు ఏకాంతంలో. మనుదుఃఖం—అక్కయ్య తనకు లేకపోయిందనే. అక్కయ్య వివాహంఅయిపోయింది. ఇక కొద్దిరోజులలో బావతో వెళ్ళిపోతుంది. మనుహృదయం క్రమేణా జారిపోతోంది. అన్నం సయించదు. ఎప్పుడూ ఏదో వెఱ్ఱివాడులా కనిపిస్తాడు. అక్కయ్య బావతో పోబోతోంది! అమాటే తనకు ఎంతో కష్టంగా వుంది.

"ఉభయవంశలలామ మయ్యుత్పలాక్షి
అత్తవారింటి కరిగెడు నవసరమున
మాతృ జనక సఖీజన భ్రాతృవిరహ
మధిపతి ప్రేమ జలరాశి కౌర్వమయ్యె."

పద్యం జ్ఞాపకం వచ్చింది. అంతేకాబోలు! అక్కయ్య యిక తన్ను మరిచిపోతుంది. తనకు ఏది లేకపోతే తా నుండలేదో తనకు అది యిక వుండదు. అదే మనువిచారం! అక్కయ్య పోబోతుంటే "అక్కయ్యా! నిన్ను వదిలి ఉండలేను. నేనూ వస్తాను" అన్నాడు ఏడుస్తూ. అక్కయ్య జాలిపడింది. హృదయం నీరయింది. తమ్ముణ్ణి కౌగిలించుకుంది.

ముగ్గురూ ఊరు చేరుకున్నారు. మనుకి విచారం తగ్గలేదు. అక్కయ్య తన్ను యిదివరకు మల్లే చూట్టంలేదు. తనతో ఎప్పుడూ కూచుని మాట్లాడేది పూర్వం. ఇప్పుడు అంతగా మాట్లాడదు. "నేను పెద్దవాణ్ణయిపోతున్నాను. ఎప్పుడూ కుఱ్ఱాణ్ణిగా వుంటే అక్కయ్యతోనే వుండొచ్చు! పాపాయినయి మళ్లీ అక్కయ్య చేతుల్లో పెరిగితే బాగుండును!" అనుకున్నాడు. తాను పాపాయి నవాలనీ—అక్కయ్యదగ్గరే ఎప్పుడూ వుండాలనీ ఆలోచనలు సాగినయి మనుకి. కాని, మార్గం? ఒక్కటే తోచింది.

ఒకనాటి రాత్రి తన గదిలో దీపం వెలిగించాడు. కొద్దిసేపయింది...దీపం అర్పేసుకున్నాడు!

మరునాడు ఉదయం పనిచేసేది ఒక కాగితం అతెచ్చి అక్కయ్య కిచ్చింది. అది చూచుకొని లోకయ్య నేల గూలింది!

"అక్కయ్యా! విచారించకండి! మీకు పాపాయినిగా పుట్టాలని ఆశగా వుంది. పాపాయిగానే పుడతాను..."

చిరకాలమునకు పునస్సమావేశమైన భారత రాజ్యాంగ పరిషత్సభ్యులు-అనంతశయనం అయ్యంగారు, జగ్జీవనరాం, శ్రీ శ్యామప్రసాద్ ముఖర్జీ గార్లు ఒకరినొకరు అభినందించుకొంటున్నారు

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర

కర్త: కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావు

పరిశోధనపద్ధతిని, సంగ్రహరూపంలో నడచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం.

పూర్వచరిత్రల నన్నిటినీ అవలోడనచేసి, సరిగా సమన్వయించి క్రోడీకరించిన వివులయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయ ధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటబడి, నానాటికీ నవనవోద్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను వాడిమితో చూపెట్టజాలిన ఉత్తమోత్తమ గ్రంథము.

వెల రూపాయలు 2.

తపాలాఖర్చు 0-6-0.

ఆంధ్రగ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.